


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 201 | బుధవారం 24 జులై 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 | ఫోన్ : 9441877695

●వందేళ్ల కులగణన వాయిదాను నెలలోనే పూర్తి చేశాం ●బీసీలకు 42% రిజర్వేషన్లు..అసెంబ్లీ తీర్మానాలు పంపినా కేంద్రం జాప్యం
●బీజేపీకి రాజ్యాంగ బోధ లేదు – రిజర్వేషన్లపై వితండవాద వాదనలపై మండిపడ్డ సీఎం
●కేసీఆర్ చేసిన అన్యాయాన్ని సరిదిద్దుతాం
●మతం కాదు, వెనుకబాటుతనమే ప్రాతిపదిక – ముస్లిం రిజర్వేషన్లపై కాంగ్రెస్ స్పష్టత
●రాహుల్ గాంధీ ద్వారా కేంద్రంపై ఒత్తిడి పెరుగుతుంది ● రైతు చట్టాల రద్దు స్ఫూర్తితో బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమం!– సీఎం రేవంత్ రెడ్డి



# బీసీ రిజర్వేషన్లపై బీజేపీది వితండవాదం

**న్యూస్ డెస్క్, 23 జూలై (కెరటం న్యూస్):** విద్య, ఉద్యోగావకాశాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి అసెంబ్లీలో రెండు తీర్మానాలను చేసి పార్లమెంట్‌కు పంపామని.. కానీ, ఆమోదం విషయంలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికే రోల్ మోడల్ నిలిచిందని అన్నారు. వందేళ్లుగా వాయిదా పడిన కులగణనను నెల రోజుల్లోనే పూర్తి చేశామని తెలిపారు. విద్య, ఉద్యోగ అవకాశాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి అసెంబ్లీలో రెండు తీర్మానాలను చేసి పార్లమెంట్‌కు పంపామని పేర్కొన్నారు. కానీ, వాటిని ఆమోదించకుండా కేంద్రం జాప్యం చేస్తోందని అన్నారు. తన అధినేత రాహుల్ గాంధీ ద్వారా ఆ బిల్లుల ఆమోదంపై కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు.

## అంతకంటే సూసైడ్ చేసుకుని చావడం మేలు..

**న్యూస్ డెస్క్, 23 జూలై (కెరటం న్యూస్):** ఫోన్ ట్యాపింగ్ ద్వారా ఫ్యామిలీ మెంబర్స్ విషయాలు విన్నారని అంటున్నారు.. అలా వినాల్సిన అవసరం ఏంటి..? ఆ పరిస్థితే వస్తే సూసైడ్ చేసుకుని చావడం మేలు అని హాట్ కామెంట్స్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై ప్రభుత్వం కేసు పెట్టలేదని, సామగ్రి మిస్సింగ్ కేసును లోతుగా విచారణ చేస్తే ఇవన్నీ బయటపట్టాయన్నారు. ఫోన్ ట్యాపింగ్ విచారణను తాను డిక్టేట్ చేయనని, నిజానికి ఫోన్ ట్యాపింగ్‌పై తొలుత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తొలుత ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ చట్టవిరుద్ధం కాదని, దానికంటూ ఓ పద్ధతి ఉంటుందన్నారు. నా ఫోన్ ట్యాప్ అయిందని అనుకోవడం లేదని.. దానిపై ఇంతవరకు నోటీసులు రాలేదన్నారు. ఒకవేళ నోటీసులు వస్తే విచారణకు వెళ్తానని స్పష్టం చేశారు సీఎం రేవంత్ రెడ్డి.

# కొత్త పరిశ్రమలు రావాలి.. యువతకు ఉపాధి దక్కాలి

**: మంత్రి శ్రీధర్ బాబు**



**న్యూస్ డెస్క్, 23 జూలై (కెరటం న్యూస్):** తెలంగాణకు కొత్త పరిశ్రమలు రావాలని.. ఇక్కడి యువతకు ఉపాధి దక్కాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఐఐ, ఫిక్కీ, ఎఫ్ టీసీసీఐ, ఎలీప్, టిఫ్, టాప్మా, టీఎస్ టీఎంఏ తదితర పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం మంత్రి మాట్లాడారు. తెలంగాణ పురోగతిలో భాగస్వామ్యమవుతున్న పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. చట్టాలు, నిబంధనల పేరిట వారిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం మాకు లేదన్నారు.

# విచారణకు పిలిచి వేధిస్తుండ్రు

**: సుప్రీంకోర్టులో ప్రభాకర్ రావు పిటిషన్**



**న్యూస్ డెస్క్, 23 జూలై (కెరటం న్యూస్):** ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు మరోసారి సుప్రీంకోర్టు తలుపుతట్టారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ పేరుతో సిట్ అధికారులు వేధిస్తున్నారని పిటిషన్ దాఖలు చేశారు.

# అప్పుడు ఆర్టీసీ ఉంటుందా అనుకునే పరిస్థితి.. ఇప్పుడు లాభాల్లో నడుస్తోంది!



**న్యూస్ డెస్క్, 23 జూలై (కెరటం న్యూస్):** గత 10 సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను నిర్వీర్యం చేశారని, ఓ సమయంలో ఆర్టీసీ ఉంటుందా? అని కూడా అనుకునే పరిస్థితి ఉండేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల్లోకి వస్తుందని తెలిపారు. గత 10 సంవత్సరాల్లో ఆర్టీసీ ఉద్యోగుల పైసలు వాడుకున్న పరిస్థితి ఉండేదని, ఇప్పుడు వారికి డబ్బులు చెల్లిస్తున్నాం అని చెప్పారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పాటు బస్సులకు యజమానులకు చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాలకు బస్సులు కొనుగోలు చేసిందన్నారు. ఆర్టీసీకి ఈ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అండగా ఉంటుందని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. 200 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంజీబీఎస్ బస్టాండ్‌లో ఆర్టీసీ వేడుకలునిర్వహించింది.

# రాజా బాయ్ సస్పెండ్ కాలేదు, రిజైన్ చేశారు.

●రాజా భాయ్ పార్టీ సభ్యత్వం కోసం ఒక్క మిస్డ్‌కాల్ ఇస్తే చాలు
- ఎంపీ ధర్మపురి అరవింద్



# 25న తెలంగాణ కేబినెట్ భేటీ.. సర్క్యూలర్ జారీ చేసిన సీఎస్

**న్యూస్ డెస్క్, 23 జూలై (కెరటం న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 25న సచివాలయంలోని 6వ అంతస్తులో సాయంత్రం 4 గంటలకు కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ భేటీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, సీఎస్ రామకృష్ణా రావు పాల్గొనున్నారు.



# మునిగిన పడవ కాదు లాభాల్లో ఆర్టీసీ!

●200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి
● మహిళల కోసం లక్ష కోట్లు వడ్డీలేని రుణాలు
●ఎలక్ట్రిక్ బస్సులదే భవిష్యత్! – 3000 బస్సులకు ఆర్డర్,
●కాలుష్యరహిత నగర దిశగా ఆర్టీసీ
–డిప్యూటీ సీఎం భట్టి



● తెలంగాణ సమాజం మీదే నిషేధాలు విధిస్తున్నారా?
● గ్రంథాలయాల్లో ఆంక్షలపై హరీష్ రావు ఫైర్ ●డెమొక్రసీ మరిచి ఎమర్జెన్సీ పద్ధతులు తీసుకొస్తున్నారేంటి? ●లైబ్రరీల చుట్టూ రాజకీయం చేసినవారే, ఇప్పుడు నిషేధాలు ఎందుకు?
● జాబ్ క్యాలెండర్ గురించి ప్రశ్నిస్తే నిషేధాజ్ఞలా?



# ప్రశ్నిస్తే నిషేధాజ్ఞలు విధిస్తారా - హరీష్ రావు

# వరద ముప్పును ఎదుర్కొనేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలి :మంత్రి సీతక్క

**న్యూస్ డెస్క్, 23 జూలై (కెరటం న్యూస్):** భారీ వర్షాల కారణంగా ములుగు జిల్లాలో ఎలాంటి ప్రాణా నష్టం, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర అధ్యక్షతన వరదలపై సంసిద్ధత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు పాల్గొన్న ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు వరద ముప్పును ఎదుర్కొనేందుకు తీసుకుంటున్న చర్యలపై వివరాలను మంత్రి సీతక్క అడిగి తెలుసుకున్నారు.



# మళ్ళీ వచ్చాక.. ప్రభుత్వానికి ,పార్టీకి సమ న్యాయం

●పాలన చేతగాక.. సమర్థత లేక ఆగమాగం
● స్థానిక సంస్థల ఎన్నికలు బీఆర్ఎస్‌కు ప్రీ ఫైనల్
● గ్యారంటీల పేరుతో అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు
● పాలిచ్చే బర్రెను వదిలి, తన్నే దున్నపోతు తెచ్చుకున్నట్లైంది
– కేటీఆర్



**న్యూస్ డెస్క్, 23 జూలై (కెరటం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడం చేతకాని దద్దమ్మ రేవంత్‌రెడ్డి అని.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక కేసీఆర్‌ను నిందిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పాలన చేతగాక.. సమర్థత లేక ఆయన ఆగమాగం అవుతున్నారని పేర్కొన్నారు. వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నేతలు బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలన్నారు.

# ఆర్డినెన్స్‌పై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలి

**: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు**

**న్యూస్ డెస్క్, 23 జూలై (కెరటం న్యూస్):** సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కేబినెట్ బీసీలను మోసం చేస్తున్నదని.. ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌పై కొర్రీలు పెట్టి గవర్నర్ వెనక్కి పంపారని ప్రచారం జరుగుతున్నదని.. ఈ విషయంపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు.



# వరద ముప్పును ఎదుర్కొనేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలి :మంత్రి సీతక్క

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా వాగులు వంకలు పొంగి పొర్లుతుండడంతో పర్యాటకులు జల పాతాళ వద్దకు వెళ్లకుండా కట్టడి చేస్తూ పలు రకాల బొమ్మలతో కూడిన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వరదల కారణంగా నష్టపరిహారం చెల్లిస్తామో కానీ ప్రాణాలు మాత్రం తీసుకురాలేమని, నిరంతరం అధికారులు 24 గంటల పాటు విధులను నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. మన జిల్లాలో వంద కిలోమీటర్ల మేర గోదావరి పరివాహక ప్రాంతం ఉందని ఇతర రాష్ట్రాలలో భారీ వర్షాలు కురిస్తే ఆ వర్షపు నీరంతా ఇక్కడి ప్రాంతం నుండే తరలిపోతూ గ్రామాలను ముంచేస్తుందని, 1986 సంవత్సరంలో జరిగిన సంఘటన భయాందోళనలు గురిచేసిందని, తిరిగి 2022, 2023 సంవత్సరాలలో పలు రకాల సంఘటనలు జరిగాయని వివరించారు.

గతంలో ఇదే ప్రాంతంలో టర్నాడో సుడిగాలి కారణంగా లక్షలాది చెట్లు కూలిపోవడం జరిగిందని, అలాంటి సుడిగాలి గ్రామాల పైకి వస్తే ఎలాంటి విపత్తు జరుగుతుందో ఊహించకుండా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి నీరు గ్రామాల్లోకి రాకుండా ఏటూరునాగారం, మంగపేట మండల సమీపంలో కరకట్టల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు సోకకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నిరంతరం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రభుత్వ పాఠశాలలు మూసి వేయాలని అన్నారు.

# రాజా బాయ్ సస్పెండ్ కాలేదు, రిజైన్ చేశారు.



**న్యూస్ డెస్క్, 23 జూలై (కెరటం న్యూస్):** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బీజేపీ పార్టీ రాజీనామాపై ఎంపీ ధర్మపురి అరవింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజా భాయ్ పార్టీ సభ్యత్వం కోసం ఒక్క మిస్డ్‌కాల్ ఇస్తే చాలన్నారు. రాజా బాయ్ సస్పెండ్ కాలేదని, రిజైన్ చేశారని తెలిపారు. కొన్ని విషయాల్లో మనస్థాపం చెంది రాజాసింగ్ రిజైన్ చేశారని పేర్కొన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు ఒక్కొక్కరికి రెండు నియోజకవర్గాల బాధ్యతలు ఇవ్వాలని అధిష్టానంకు సూచించారు. ప్రతిఒక్కరికి పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలని, ఫలితం చూపించకపోతే పక్కకు పెట్టాలని ఎంపీ ధర్మపురి చెప్పుకొచ్చారు.

పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఈరోజు ఎంపీ ధర్మపురి అరవింద్ బీజేపీ పార్టీకి సంబంధించిన పలు అంశాలపై మాట్లాడారు. 'రాజాసింగ్ ఎక్కడున్నా మేము గౌరవిస్తాం. ఆయన ఐడియాలాజికల్ మ్యాప్. రాజా బాయ్ సస్పెండ్ కాలేదు, రిజైన్ చేశారు. రాజాసింగ్ పార్టీ సభ్యత్వం కోసం ఒక్క మిస్డ్ కాల్ ఇచ్చి మెంబర్‌షిప్ తీసుకొచ్చు. కొన్ని విషయాల్లో మనస్థాపం చెంది రిజైన్ చేశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు ఒక్కొక్కరికి రెండు నియోజకవర్గాల బాధ్యతలు ఇవ్వాలి. పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలి, ఫలితం చూపించకపోతే పక్కకు పెట్టాలి. ఏ పార్టీకైనా కార్యకర్తలు కీలకం. కార్యకర్తలు, నాయకులు అయ్యే సమయం ఇది. ఇందూర్ జిల్లాలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవి మేం గెలుస్తున్నాం. తెలంగాణలో వచ్చేవి కార్యకర్తల కోసం జరిగే ఎన్నికలు. ప్రతి నాయకులు ఈ విషయాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలి. తమ కార్యకర్తలను నాయకులుగా చేయాలి. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మనం గెలిపించుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవాలి' అని ఎంపీ ధర్మపురి అన్నారు.'కాంగ్రెస్‌లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏం చేస్తున్నారు. కొండా మురళి, కొండా సురేఖలు ఏం చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీలో కవిత, కేటీఆర్ ఏం చేస్తున్నారు. పార్టీ అన్నాక కొన్ని నడుస్తూ ఉంటాయి. బీజేపీ పాత అధ్యక్షుడు, కొత్త అధ్యక్షుడు కలిసి ఈటల, బండి సంజయ్ విషయంలో మాట్లాడాలి. అవసరమైతే అధిష్టానం పెద్దలు మాట్లాడాలి. ఈటల, బండి సంజయ్ విషయంలో సెంట్రల్ పార్టీ నోడల్ ఎంక్వయిరీ కమిషన్ వేసుకోవాలి' అని ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు.

# మునిగిన పడవ కాదు లాభాల్లో ఆర్టీసీ!

**న్యూస్ డెస్క్, 23 జూలై (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి రూ.6680 కోట్ల రూపాయలు ప్రయాణ చార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్‌లో మహాలక్ష్మి సంబరాలు చేస్తోంది. ఉచిత బస్సు ప్రయాణాల వేడుకలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ హాజరయ్యారు. ఆర్టీసీ వేడుకలలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి రాష్ట్ర మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తర్వాత ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందని పేర్కొన్నారు.



'200 కోట్ల మహిళా ఉచిత ప్రయాణాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ పండగ కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2023 డిసెంబర్ 9న ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం. 200 కోట్ల ఉచిత మహిళా ప్రయాణికులు 6680 కోట్లు ఆదా చేసుకున్నారు వారికి శుభాకాంక్షలు. మునిగిపోతున్న పడవ ఎందుకు ఎక్కుతారని ఆరోజు అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తరువాత ఇప్పుడు ఆర్టీసీ లాభాల్లోకి వచ్చింది. మునిగిపోతున్న పడవ కాదు లాభాల్లోకి వస్తున్న ప్రభుత్వ సంస్థ. 200 కోట్ల మహిళా ప్రయాణికుల చార్జీలను 6680 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించింది. భవిష్యత్తులో కూడా మీ చార్జీలను ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. వచ్చిన ఆదాయం ద్వారా కొత్త బస్సులు కొనుగోలు చేసే స్థాయికి ఆర్టీసీ ఎదిగింది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు 2400 కొత్త బస్సులు కొనుగోలు చేసింది' అని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు.

ఆర్టీసీపై రవాణా శాఖ మంత్రి కొత్త విధానాలు ప్రవేశపెట్టారు. ఒకప్పుడు ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో 62 శాతం ఉంటే.. ఇప్పుడు 97 శాతంకి పెరిగింది. మహాలక్ష్మికి ముందు 45 లక్షల మంది ప్రయాణం చేస్తే.. ఇప్పుడు 65 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో కాలుష్యం పెరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆలోచన చేశారు. కాలుష్య రహిత నగరంగా మార్చడానికి నగరంలో ఉన్న 2800 బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు తీసుకురావాలని ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. ఇప్పుడు ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. ఇప్పటికే 3000 ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులకు ఆర్డర్ ఇచ్చారు. ఇప్పటికే 11 శాతం ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులు వచ్చాయి, దానిని పెంచుకుంటూ పోతున్నారు. మహాలక్ష్మి పథకం విరివిగా ఉపయోగించి 200 కోట్ల ప్రయాణాలు పూర్తి చేసుకొని మీరు అనేక ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకున్నారు, నగరాల్లో పనికి ఉపయోగించుకున్నారు, అవసరాల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లారు. మీరు 6680 కోట్ల రూపాయలు మీ కుటుంబాలకు అదా చేసుకున్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది. ఆర్టీసీలో కేవలం ప్రయాణమే కాదు.. ఆర్టీసీ బస్సులకు యాజమానులను చేశాం. వడ్డీలేని రుణాలు ద్వారా బస్సులు కొనుగోలు చేయించారు. 150 మహిళా సంఘాల ఆర్టీసీ బస్సు యజమానులకు కోటి రూపాయల చెక్కులు ఇటీవలే అందించాం. ఇప్పటికే 25 వేల కోట్ల వడ్డీలేని రుణాలు మహిళలకు అందించాం. ఈ 5 ఏళ్లలో లక్ష కోట్లు మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తాము. రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల కోట్ల రూపాయలతో రోడ్ల మరమత్తులు ,అభివృద్ధి చేయడానికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు పోతున్నారు. దీని ద్వారా రవాణా మరింత అభివృద్ధి చెందుతుంది' అని డిప్యూటీ సీఎం తెలిపారు.

# కొత్త పరిశ్రమలు రావాలి.. యువతకు ఉపాధి దక్కాలి: మంత్రి శ్రీధర్ బాబు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలోని ప్రతి పరిశ్రమను కాపాడుకుంటామని తెలిపారు.ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ఎంఎస్ఎంఈ రంగానికి అండగా ఉంటామని అన్నారు. అలాగే కార్మికుల ప్రయోజనాలను కాపాడుతాం అని వివరించారు. గత ప్రభుత్వం మాదిరిగా ఏకపక్షంగా వ్యహరించబోమని స్పష్టం చేశారు. మాది అందరినీ కలుపుకునిపోయే ప్రభుత్వమని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం అందరి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. వాటిని ఆచరణలో పెడతామని.. పారిశ్రామికాభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రయాణంలో పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. అందుకే.. పలు పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో సమావేశమై రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మేధోమథనం చేశామని పేర్కొన్నారు. పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మారిందని. ఏడాదిన్నర వ్యవధిలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రానికి కొత్తగా రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకొచ్చామని తెలిపారు. ప్రైవేట్ రంగంలో లక్ష మందికి పైగా ఉపాధి కల్పించామని. అయినా.. రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలి వెళ్లిపోతున్నాయంటూ బీఆర్ఎస్, బీజేపీ మాపై దుష్ప్రచారం చేస్తుంది అని, కొత్తగా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల గురించి సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులకు మంత్రి వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించారు. సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తెలంగాణ మినమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ జనక్ ప్రసాద్, ఐటీ, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు సమీవుద్దీన్, రాజీవ్ వెంకటరమణ, రాంచంద్రారావు, శేఖర్ రెడ్డి, జయదేవ్, రాజీవ్, సుజాత, రమాదేవి, సుధీర్ రెడ్డి, సునీల్, గౌతమ్, అరుణ్, నరేందర్ పాల్గొన్నారు.

# ప్రశ్నిస్తే నిషేధాజ్ఞలు విధిస్తారా - హరీష్ రావు

**న్యూస్ డెస్క్, 23 జూలై (కెరటం న్యూస్):** ప్రశ్నిస్తే పగబట్టినట్టుగా అన్నీ వర్గాలపై ఆంక్షలు విధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి నిత్యకృత్యంగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మొన్న యూనివర్సిటీల్లో ఆందోళనలు నిషేధిస్తూ మెమో ఇచ్చారు. నేడు లైబ్రరీల్లో విద్యార్థులపై ఆంక్షలు విధిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య పాలన అనే ఏడో గ్యారంటీని మరచి ఎమర్జెన్సీ రోజులను తిరిగి తెస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు..

గ్రంథాలయాలను రాజకీయ వేదికలుగా మార్చిన దుర్మార్గ చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని హరీశ్‌రావు విమర్శించారు. ఇప్పుడు సుద్దపూస మాటలు, నీతులతో బోర్డులు పెట్టినంత మాత్రాన పాపపరిహారం కాదని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రాజకీయం అంతా లైబ్రరీల చుట్టే జరిగిందని తెలిపారు. రాహుల్ గాంధీని సైతం లైబ్రరీకి తీసుకొచ్చి బూటకపు హామీలు ఇచ్చిన సంగతి మరిచిపోయారా అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే అవి రాజకీయ వేదికలు కావు, గ్రంథాలయాలు అని గుర్తు వచ్చాయా అని నిలదీశారు.

గ్రంథాలయాల్లో పోలీసు లాఠీ చార్జీలు జరిపించిన అరాచక చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది అని హరీశ్‌రావు మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల వీపులు పగుల గొట్టిన అమానుష పాలన కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. జాబ్ క్యాలెండర్ ఏమైందని మీ నాయకుడిని విద్యార్థులు నిలదీసినందుకు, ఈరోజు గ్రంథాలయాల్లో నిషేధాజ్ఞలు ఏర్పాటు చేస్తారా అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఒక విధంగా, అధికారం పక్షంలోకి రాగానే మరొక విధంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నదని తెలిపారు. మొత్తం తెలంగాణ సమాజం మీద నిషేధాజ్ఞలు విధిస్తారా అని ప్రశ్నించారు.

# అప్పుడు ఆర్టీసీ ఉంటుందా అనుకునే పరిస్థితి.. ఇప్పుడు లాభాల్లో నడుస్తోంది!

మొదటి పేజీ తరువాయి




ఈ వేడుకలకు మంత్రి పొన్నం హాజరై మాట్లాడారు. '200 కోట్ల మహిళా ఉచిత ప్రయాణం పూర్తయిన సందర్భంగా అందరికి శుభాకాంక్షలు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన 2023 డిసెంబర్ 9న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా శాసన సభ వేదిక మహాలక్ష్మి పథకం ప్రారంభించుకున్నాం. ఇప్పటివరకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకున్నాం. ఈ పథకం విజయవంతం కావడానికి కృషి చేసిన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లకు అభినందనలు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఎక్కడికి వెళ్లాలన్నా ఉచితంగా వెళు తున్నారు. ఉద్యోగాలు, షాపింగ్, దేవాలయాలు%ా% ఎక్కడికి వెళ్లాలన్నా ఉచిత ప్రయాణం ఉపయోగించుకుంటున్నారు. గత 10 సంవత్సరాల్లో ఆర్టీసీని నిర్వీర్యం చేశారు. ఆర్టీసీ ఉంటుందా అని కూడా అనుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆర్టీసీ నష్టాల నుండి లాభాల్లోకి వస్తుంది. కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నాం, నియామకాలు చేస్తున్నాం. గత 10 సంవత్సరాల్లో ఆర్టీసీ ఉద్యోగుల పైసలు వాడుకున్న పరిస్థితి, ఇప్పుడు వారి డబ్బులు చెల్లిస్తున్నాం' అని మంత్రి పొన్నం తెలిపారు.'సంస్థ పరిరక్షణ ప్రయాణికుల సౌకర్యం ఉద్యోగుల సంక్షేమం నినాదంతో ఆర్టీసీ ముందుకు పోతుంది.ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పాటు బస్సులకు యజమానులకు చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాలకు బస్సులు కొనుగోలు చేసింది. ఇటీవల 150 బస్సులకి కోటి రూపాయల చెక్కులు కూడా అందజేసాము. గతంలో 45 లక్షల మంది ప్రయాణం చేస్తే ఇప్పుడు 65 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. 60 శాతం ఉన్న ఆక్యుపెన్సీ ఇప్పుడు 97 శాతంకి పెరిగింది. ఆర్థిక విధ్వంసం తరువాత ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ఆర్టీసీకి ఈ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అండగా ఉంటుంది. ఈరోజు 97 బస్సు డిపోలు, 324 బస్ స్టేషన్లలో 200 కోట్ల మహిళా ఉచిత ప్రయాణాలు 6680 కోట్ల రూపాయల విలువైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు నిర్వహిస్తున్నాం' అని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు.

# విచారణకు పిలిచి వేధిస్తుండ్రు

## : సుప్రీంకోర్టులో ప్రభాకర్ రావు పిటిషన్

మొదటి పేజీ తరువాయి



విచారణ పేరుతో తరుచూ పోలీస్ స్టేషన్‌కు పిలుస్తున్నారని వాపోయారు.

2025, ఆగస్టు 4వ తేదీన ప్రభాకర్ రావు పిటిషన్ విచారణకు రానున్నట్లు సమాచారం. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ చేయకుండా ప్రభాకర్ రావుకు కల్పించిన వెసులుబాటును కొట్టేయాలని ఇప్పటికే సిట్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్.. ఈ కేసు నమోదు కాగానే విదేశాలకు పారిపోయాడు. పోలీసులు ఒత్తిడి, అరెస్ట్ చేయకుండా సుప్రీంకోర్టు రక్షణ కల్పించడంతో తిరిగి హైదరాబాద్ వచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు అవుతున్నారు. ఇప్పటికే సిట్ అధికారులు ప్రభాకర్ రావును పలుమార్లు విచారించారు.

ప్రభాకర్ రావు దర్యాప్తుకు సహకరించడం లేదని.. ఆయనను అరెస్ట్ చేయకుండా కల్పించిన ఆదేశాలను కొట్టేయాలని సిట్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఓ వైపు ఈ పిటిషన్‌పై విచారణ జరుగుతుండగానే.. మరోవైపు సిట్ అధికారులు విచారణ పేరుతో వేధిస్తున్నారని ప్రభాకర్ దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో సుప్రీంకోర్టు నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

# బీసీ రిజర్వేషన్లపై బీజేపీది వితండవాదం..

మొదటి పేజీ తరువాయి

గురువారం రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేను కలిసి కులగణన, రిజర్వేషన్లపై చర్చిస్తామని అన్నారు. మిగతా భాగస్వామ్య పక్షాలను కూడా కలుపుకుని పోతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌కు ఓ రాజ్యాంగం.. బీజేపీకి ఓ రాజ్యాంగం ఉండదు

కులగణన అంశాలను ఉభయ సభల్లోని కాంగ్రెస్ ఎంపీలకు వివరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్రలో ముస్లిం రిజర్వేషన్లు కొనసాగుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై బీజేపీ వితండవాదం చేస్తోందని ఫైర్ అయ్యారు. ముఖ్యంగా ఆ పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌రావు వాదన వింతగా ఉందన్నారు. మీరు ఇచ్చిన హామీని.. మీరే అమలు చేసుకోవాలని అంటున్నారని.. ఇది వితండవాదం కాక మరేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఓ రాజ్యాంగం.. బీజేపీకి ఓ రాజ్యాంగం ఉండదని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నేతలు కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఎలాగైనా బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు సాకులు వెతుకుతున్నారని ఆరోపించారు. కులగణనపై నిపుణుల కమిటీ ఓ నివేదికను ఇచ్చిందని.. కేబినెట్, అసెంబ్లీలో చర్చించాక దీన్ని ప్రజల ముందు ఉంచుతామని అన్నారు. డేటీ ప్రైవసీ యాక్ట్ ప్రకారం వ్యక్తిగత డేటా ఇవ్వడానికి వీలు లేదన్నారు. ముస్లింలకు మతం ప్రాతిపదికగా రిజర్వేషన్లు ఇవ్వడం లేదని, వెనుకబాటుతనమే ప్రాతిపదికగా రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని తెలిపారు. మధ్యప్రదేశ్‌లో 38 ముస్లిం ఉప కులాలు రిజర్వేషన్లు పొందుతున్నాయని పేర్కొన్నారు. గుజరాత్ 27, ఉత్తర్ ప్రదేశ్‌లో 7 ముస్లిం ఉప కులాలు రిజర్వేషన్లు పొందుతున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

బీసీలకు కేసీఆర్ అన్యాయం చేశారు..

ఒక వర్గం పేరు చెప్పి తెలంగాణలో బీసీ రిజర్లేషన్లపై బీజేపీ మొండి వాదనను తెరపైకి తీసుకొస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్న వాళ్లే సందేహాలను లేవనెత్తుతున్నారని కామెంట్ చేశారు. తెలంగాణలో సెప్టెంబర్ లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందని.. కేంద్ర త్వరగా రిజర్వేషన్ల బిల్లును ఆమోదిస్తే.. స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని కుండబద్దలు కొట్టారు. మూడు రైతు వ్యతిరేక చట్టాల విషయంలో ఏం జరిగిందో అందరూ చూశారని, రైతు చట్టాల రద్దు స్ఫూర్తిగా బీసీ రిజర్వేషన్ల చట్టం ఆమోదం కోసం పోరాడుతామని అన్నారు. ముస్లింల పేరుతో మరోసారి భావోద్వేగ రాజకీయాలు చేయాలని బీజేపీ చూస్తోందని.. తాము కల్పించే రిజర్వేషన్లలో మతం ప్రస్తావనే లేదని అన్నారు. బీసీలకు అన్యాయం చేసేలా గతంలో కేసీఆర్ పంచాయతీ రాజ్ చట్టానికి సవరణలు చేశారని, కానీ, తాము సామాజిక వెనుకబాటు ఆధారంగానే రిజర్వేషన్లు కల్పించ ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# మళ్ళీ వచ్చాక.. ప్రభుత్వానికి పార్టీకి సమ న్యాయం

మొదటి పేజీ తరువాయి

ఆరు గ్యారంటీల పేరుతో అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ప్రజలను దారుణంగా మోసం చేసిందన్నారు.మీసేవ కార్యాలయాల్లో ఇచ్చే రేషన్ కార్డులను జారీ చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్ద పెద్ద సభల్లో గప్పాలు కొట్టుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో ఉన్న అంతులేని వ్యతిరేకతను అందిపుచ్చుకోవాలని.. అభ్యర్థితో సంబంధం లేకుండా కారు గుర్తుకు ఓటు వేసేలా ప్రజలను చైతన్యపరచాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, జిల్లా పరిషత్ స్థానం బీఆర్ఎస్‌దే అవుతుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో బీఆర్ఎస్ గెలిచిన తరువాత కాంగ్రెస్ కార్యకర్తల్లాగా పనిచేస్తున్న అధికారులంతా సెట్ రైట్ అవుతారన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు స్థానిక సంస్థల ఎన్నికలు ప్రీ ఫైనల్ లాంటివని.. టికెట్ ఎవరికి ఇచ్చినా వారిని గెలిపించుకోవాలని బీఆర్ఎస్ క్యాడర్‌కు సూచించారు.

గతంలో చేసిన తప్పును పునరావృతం చేయం

రేపు అధికారంలోకి వచ్చాక గతంలో చేసిన తప్పును పునరావృత్తం చేయబోమని.. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యకర్తలు, నాయకులను కళ్లలో పెట్టుకొని చూసుకుంటామని కేటీఆర్ వెల్లడించారు. వికారాబాద్ ప్రజల దశాబ్దాల స్వప్నమైన జిల్లాను ఏర్పాటుచేసి సరిగా చెప్పుకోలేపోయామని.. మెడికల్, నర్సింగ్ కాలేజీని కేసీఆర్ సాకారం చేశారని చెప్పారు. ఆడబిడ్డలకు రూ.300 కోట్ల వడ్డీ లేని రుణాలను ఇచ్చి ఏదో ఘనకార్యం చేసినట్టు కాంగ్రెస్ సంబరాలు చేసుకుంటున్నదని.. కేసీఆర్ హయాంలో రూ.3వేల కోట్ల వడ్డీ లేని రుణాలను ఇచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని సీఎంతో పాటు కాంగ్రెస్ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని.. తొమ్మిదేళ్లలో 6.5 లక్షల రేషన్ కార్డులను అర్హులకు ఇచ్చామని వెల్లడించారు. ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే 90 వేల కార్డులు ఇచ్చామని తెలిపారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ దారుణంగా మోసం చేసిందని అన్నారు. పెన్షన్ తీసుకునే పెద్దమనుషులకు రేవంత్‌రెడ్డి రూ.40 వేల బాకీ ఉన్నారని, ఆడ పిల్లలకు ఐదు లక్షల భరోసా కార్డు, స్కూటీలు, ప్రతీ ఆడబిడ్డకు రూ.50 వేలు బాకీ ఉన్నారని అన్నారు. రాహుల్ గాంధీ ఫొటోతో గ్యారెంటీ కార్డులు ఇచ్చి ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారని ఆరోపించారు. పాలిచ్చే బర్రెను పక్కనపెట్టి ఎగిరితన్నే దున్నపోతును తెచ్చుకున్నట్టు అయిందని ఇవాళ ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు.

స్థానిక సంస్థలు బీఆర్ఎస్‌కు ప్రీ ఫైనల్

ఈసారి వికారాబాద్ జిల్లాలో ఒక్క సీటు కూడా కాంగ్రెస్‌కు పోకుండా అన్ని స్థానాల్లో గులాబీ జెండా ఎగరేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు స్థానిక సంస్థల ఎన్నికలు ప్రీఫైనల్ లాంటివని.. ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారు. తమ కోసం కష్టపడ్డ కేడర్‌ను తాము గెలిపించుకుంటామని వెల్లడించారు. అలాగే.. ఇంటింటికీ తిరిగి కడుపులో తలకాయ పెట్టి ప్రజలకు కాంగ్రెస్ చేస్తున్న మోసాలను వివరించి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పోలీసులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లాగా పనిచేస్తున్నారని.. బాల్కొండ పోలీస్ స్టేషన్‌లోనే కాంగ్రెస్ నేతలు ప్రెస్‌మీట్ పెట్టడం సిగ్గుచేటన్నారు. మల్కాజ్‌గిరిలో గుండాలు రోడ్డు మీద షో చేస్తే పోలీసులు ఏమీ చేయలేక చేతులు ముడుచుకొని కూర్చున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగరేస్తే అధికారులందరూ సెట్ రైట్ అవుతారన్నారు.

# ఆర్డినెన్స్‌పై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలి

## : ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్



**న్యూస్ డెస్క్, 23 జూలై (కెరటం న్యూస్):** సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కేబినెట్ బీసీలను మోసం చేస్తున్నదని.. ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌పై కొర్రీలు పెట్టి గవర్నర్ వెనక్కి పంపారని ప్రచారం జరుగుతున్నదని.. ఈ విషయంపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కుట్ర చేస్తూ బీసీల హక్కులను కాలరాస్తున్నారన్నారు. కులగణన పేరిట రూ.160 కోట్లు ఖర్చు పెట్టారని.. లక్షమంది ఉద్యోగులను వినియోగించారని.. రిపోర్ట్స్ ఎందుకు పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదో చెప్పాలని డిమాండ్ చేశారు.శాసనసభ శాసనమండలి సభ్యులకు కూడా ఇవ్వడం లేదని అన్నారు. సీఎం ఢిల్లీ పర్యటనలతో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీల మెప్పు కోసం ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి కులగణనపై జరిగిన సర్వే, కమిషన్ నివేదికలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి వద్ద ఉన్న బిల్ సంగతి.. గవర్నర్ వద్ద ఉన్న ఆర్డినెన్స్ సంగతి ఏంటని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారావు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని.. ఆయన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి డిమాండ్ చేశారు.

## 25న తెలంగాణ కేబినెట్ భేటీ.. సర్క్యూలర్ జారీ చేసిన సీఎస్

**న్యూస్ డెస్క్, 23 జూలై (కెరటం న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 25న సచివాలయంలోని 6వ అంతస్తులో సాయంత్రం 4 గంటలకు కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ భేటీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, సీఎస్ రామకృష్ణా రావు పాల్గొనున్నారు. అయితే, కేబినెట్ భేటీలో చర్చించాల్సిన పలు అంశాలపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, ప్రభుత్వ కార్యదర్శులు అజెండా అంశాలను సాధారణ పరిపాలన విభాగానికి పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్ రామకృష్ణ రావు ఇవాళ సర్క్యూలర్ జారీ చేశారు.

## దండి సురేష్ కు శుభాకాంక్షలు: ఆర్జేసి కృష్ణ



**ఖమ్మం టౌన్, 23 జూలై (కెరటం న్యూస్):** సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి గా ఎన్నికైన దండిసురేష్ ను మున్నూరు కాపు సంక్షేమ సంఘం నాయకులు,ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గుండాల కృష్ణ ఆధ్వర్యం లో యాదవ సంఘం అధ్యక్షులు,మాజీ డిసిసిబి ఛైర్మన్ కురాకుల నాగభూషణం, గౌడ సంఘం అధ్యక్షులు కత్తి నెహ్రూ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్తా సీతారాములు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, గీతా వెంకన్న, కనకం జనార్దన్ తదితరులు కలిసి బుధవారం సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ సురేష్ తన నియామకం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి అని ఆకాంక్షించారు.మిగతా పార్టీలు కూడా బీసీ లకు తగు ప్రాదాన్యత ఇవ్వాలన్నారు.అదేవిధంగా బీసీ లంతా ఒకతాటి పైకి వచ్చి 42శాతం రిజర్వేషన్ తో పాటు త్వరలో జరిగే కేంద్ర కులగణను కూడా విజయవంతం చేసుకుని బీసి లంతా రాజ్యాధికారం దిశగా పయనించాలన్నారు.

## సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం



**ఖమ్మం టౌన్, 23 జూలై (కెరటం న్యూస్):** కెప్టెన్ లక్ష్మిసెహగల్ 13 వర్ధంతి సందర్భంగా మెరుగు రమణ అధ్యక్షతన వర్ధంతి సభ జరిగింది. ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి పూలమాల వేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ,జిల్లా కార్యదర్శి బండి పద్మ మాట్లాడుతూ ఆనాడు దేశము నుండి బ్రిటిష్ సామ్రాజ్యవాదులను తరిమికొట్టే స్వతంత్ర పోరాటంలో లక్ష్మీ సెహగల్ మొట్టమొదటి మహిళా కెప్టెన్ గా పనిచేశారు రెండో ప్రపంచ యుద్ధం కాలంలో బ ర్మలో గాయపడ్డ వారికి వైద్యం అందించడంలో ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు వారికి వైద్య సేవలు అందించడంలో ఆమె ముందున్నారు. ప్రస్తుతం అమెరికన్ సామ్రాజ్యవాదులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తమ గుప్పెట్లో ఉంచుకోవడానికి దేశాల మధ్య చిచ్చు పెట్టి యుద్ధ ఉన్మాదాన్ని పెంచి పోషిస్తుంది. యుద్ధం జరిగిన దేశంలో మహిళలు పిల్లలు ఎక్కువగా బలవుతున్నారు అందుకే మహిళలు అంతా ఐక్యమై యుద్ధం ఉన్మా దానికి వ్యతిరేకంగా లక్ష్మీ సెహగల్ గారి స్ఫూర్తితో పోరాడుదాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా కమిటీ సభ్యురాలు ఎస్కె మెహరున్నిసా బేగం మండల కార్యదర్శిలు అమరావతి, అజిత , వెంకట్ లక్ష్మి భూలక్ష్మి, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధి కి బివికె సేవలు గొప్పవి



**ఖమ్మం టౌన్, 23 జూలై (కెరటం న్యూస్):** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి బోడేపూడి విజ్ఞాన కేంద్రం సేవలు ప్రశంసనీయమని మిత్ర ఫౌండేషన్ అధ్యక్షులు కురివెళ్ల ప్రవీణ్ తెలిపారు బుధవారం బి వి కే ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల శిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది మహిళలకు ఉచితంగా మిత్ర ఫౌండేషన్ ఎన్నారై పౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలు అందించడం విద్యార్థులు ఉద్యోగాలు కోసం ప్రయత్నాలు చేస్తున్న వారికి నామమాత్రపు ఫీజు తో హాస్టల్ వసతి గ్రంథాలయం కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాలతో బి వి కే సేవలు అమోఘమని ఆయన తెలిపారు బి వి కె జనరల్ మేనేజర్ వై శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో బి వి కే కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ రిటైర్ అయిన ఉద్యోగులు ఉపాధ్యాయులు సమాజలి సేవలో భాగంగా అంకితభావంతో చేస్తున్న కృషి ఫలితంగా బి వి కే కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయని మహిళలకు నాలుగు నెలలపాటు టైలరింగ్ లో శిక్షణ ఇప్పించడంలో సభ్యుల కృషి ఘనమన్నారు బి వి కే జనరల్ మేనేజర్ వై శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు అందించడంలో దాతల ఆర్థిక సహకారం కూడా కారణం అన్నారు ఎన్నారై పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు కే హిమబిందు సభలో ప్రసంగిస్తూ టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నారు స్త్రీలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు సభలో పెన్షనర్స్ సంఘం జిల్లా కార్యదర్శి కే నాగేశ్వరరావు టి పి ఎస్ కే జిల్లా కార్యదర్శి పి ఝాన్సీ ఎన్ గోవిందరావు వి వీరభద్రం ఎస్.కె అఫ్జల్ మియా జీ రామారావు టి వెంకట్రావు జాన్ బి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



## కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నామ

## యువతకు మార్గదర్శి కేటీఆర్ - మాజీ ఎంపీ నామ

**హైదరాబాద్ బ్యూరో, 23 జూలై (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, యువ నేత, మాజీ ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని (జూలై 24) పురస్కరించుకొని, బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో రాష్ట్ర ప్రజల కోసం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన కొరకు, పరిశ్రమలు, ఐటీ రంగం, మున్సిపాలిటీ అభివృద్ధిలో కేటీఆర్ విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రత్యేకంగా ఐటీ రంగంలో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపిన నాయకుడిగా ప్రశంసించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలతో మమేకమై, రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తిగా గుర్తుచేశారు. ఆయన అంకితభావం, కార్యదీక్ష, ప్రజల పట్ల నిబద్ధత ఓ అసాధారణ నాయకుడిని తీర్చిదిద్దిందన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా ఆయన అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా కేసీఆర్ కిట్ల పంపిణీ, రక్తదాన శిబిరాలు, మొక్కల నాట్లు, హరితహారం, అన్నదాన కార్యక్రమాలు జరగడాన్ని అభినందించారు. రాబోయే రోజుల్లో కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మరింత బలపడుతుందని ఆశించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సమస్యలపై గళమెత్తే ధైర్యమైన నాయకుడిగా ఆయన కనిపిస్తారని పేర్కొన్నారు. సమస్యలపై పరిష్కార దిశగా ఆలోచించగల నైపుణ్యం ఆయనకు ప్రత్యేకత అన్నారు. భవిష్యత్తులో మరిన్ని బాధ్యతలు చేపట్టి, దేశవ్యాప్తంగా తెలంగాణ ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. యువతకు మార్గదర్శిగా, మార్గనిర్దేశకుడిగా నిలిచిన నేతగా కేటీఆర్‌ను అభివర్ణించారు. ఆయన చేపట్టే ప్రతి కార్యక్రమం ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా ఉంటుందని నామ అభిప్రాయపడ్డారు. తండ్రి కేసీఆర్ మార్గంలో తెలంగాణ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న నాయకుడిగా కేటీఆర్ అని పేర్కొన్నారు.



ప్రజల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఆయనతోనే ఉంటుందని తెల్పుతూ, కేటీఆర్‌కి దీర్ఘాయుష్, మంచి ఆరోగ్యం, విజయవంతమైన రాజకీయ జీవితంతో ముందుకు సాగాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను అని నామ తెలిపారు.

## మహిళల చిరు నవ్వులే ప్రజా ప్రభుత్వానికి ఆశీస్సులు

### మహిళల అభ్యున్నతికి ప్రణాళికా బద్ధంగా చర్యలు

### మంత్రి తుమ్మల



**ఖమ్మం బ్యూరో, 23 జూలై (కెరటం న్యూస్):** మహిళల చిరు నవ్వులే ప్రజా ప్రభుత్వానికి ఆశీర్వాదాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి ప్రయాణ చార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా ఖమ్మం నగరం క్రొత్త బస్టాండ్ లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఆర్టిసి ఉచిత బస్సు ప్రయాణం పట్ల మహిళల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనిత, జ్యోతి అనే మహిళలు, శ్వేత అనే విద్యార్థిని తమ కుటుంబానికి ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల నెలకు 3 వేల రూపాయల వరకు ఆదా అవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కీలకపాత్ర పోషించిన శ్రీమతి సోనియాగాంధీ



పుట్టినరోజు సందర్భంగా ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలో డిసెంబర్ 9 న మహాలక్ష్మి పథకం క్రింద ఆర్టిసి బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించామని అన్నారు. చిన్న ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే మహిళలకు ఉపయోగకరంగా ఉచిత బస్సు ప్రయాణ పథకం ఉందని, 20 నెలల కాలంలో ప్రభుత్వం ఈ పథకంపై 6700 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసిందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు ఆర్టీసీ సంస్థ నిలబడేందుకు ఈ పథకం ఉపయోగ పడిందని అన్నారు. మహిళల చిరు నవ్వులే ప్రజా ప్రభుత్వానికి ఆశీర్వాదాలని అన్నారు. 500 రూపాయల గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలు కూడా మహిళల పేరు మీదే అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. మహిళల ఆశీర్వాదం ఉంటే అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామని మంత్రి తెలిపారు. మన రాష్ట్రంలో అమలు జరిగిన తీరును పరిశీలించి పక్కన రాష్ట్రాలలో ఉచిత ఆర్టీసీ బస్సు పథకం ప్రారంభమవుతుందని, మన తెలంగాణ దేశానికే ఆదర్శవంతంగా నిలిచిందని అన్నారు. సజ్జనార్ ఆధ్వర్యంలో ఆర్టీసీ సమర్థవంతంగా పని చేస్తుందని అన్నారు. పాత బస్టాండ్ రద్దీ అవుతుంటే గత పాలకుల హయాంలో తానే కొత్త బస్టాండ్ నిర్మాణానికి రూపకల్పన చేశానని, మల్టీప్లెక్స్, ఫుడ్ కోర్టు, ఇతర సౌకర్యాలతో ఏర్పాటు చేయాలి అనుకున్నామని అన్నారు. ఖమ్మం నగరంలో అవసరమైన సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, హైదరాబాద్ కు దీటుగా కేబుల్ బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్నాయని అన్నారు. ఖమ్మం ఖిల్లా రోప్ వే నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టామని, సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా గడిపే విధంగా ఖిల్లా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. గతంలో లకారం చెరువు అభివృద్ధి చేస్తే చాలా మంది అడ్డ పడ్డారని, నేడు అక్కడ సాయంత్రం చాలా కుటుంబాలు ఆహ్లాదంగా గడుపుతున్నాయని, అదే స్థితిలో ఖమ్మం ఖిల్లా, వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపట్టామని అన్నారు.ఖమ్మం నగరంలో మెడికల్ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యాలయాలు, స్వామి నారాయణ విద్యాలయం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రజలు ఖమ్మంలో ప్రశాంతంగా జీవించేలా సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ గత 20 నెలల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో మహిళలు 200 కోట్ల సార్లు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణం చేశారని, అనేక మంది వివిధ పనులపై పల్లెల నుంచి పట్టణాలకు వస్తున్నారని, మహిళలకు నెలకు డబ్బులు మిగులుతున్నాయని అన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, క్యాంటీన్ ఏర్పాటు, ఇతర వ్యాపారాల కల్పనకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని అన్నారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూలి చిన్న, చిన్న వ్యాపారాలు, ఉద్యోగాలు చేసే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మంచి స్వాతంత్ర్యం, కొత్త అవకాశాలు కల్పించిందని, మహిళలు నెలలో కొంత డబ్బులు ఆదా చేయడం వల్ల కుటుంబ స్థితిగతులు మెరుగుపడు తున్నాయని అన్నారు. ఆర్టిసి బస్సు ప్రయాణం వల్ల మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం లభిస్తుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించడంలో కృషి చేస్తున్న ఆర్టీసీ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల కలిగిన లాభాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలిచిన వారికి, మహిళా ప్రయాణికులకు బహుమతులు అందజేశారు. మంజూరైన నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.అనంతరం గతంలో మూలగూడెం గ్రామస్థులకు ఇచ్చిన వాగ్దానం మేరకు మంత్రివర్యులు అదనపు కలెక్టర్ డాక్టర్ పి శ్రీజ, మహిళలతో కలిసి ఖమ్మం బస్ స్టాండ్ నుండి మూలగూడెం వరకు క్రొత్తగా బస్ సౌకర్యం కల్పించి, అదే బస్ లో ప్రయాణించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా, ఖమ్మం ఆర్టీసీ రీజనల్ మేనేజర్, అర్బన్ తహసిల్దార్ సైదులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## ఆయిల్ పామ్ లాభదాయకం

**ఖమ్మం కలెక్టరేట్, 23 జూలై (కెరటం న్యూస్):** ఆదాయాన్ని ఇచ్చే పంట ప్రస్తుత పరిస్థితులలో ఆయిల్ పామ్ పంట లాభదాయకమని ఖమ్మం ఉద్యాన అధికారి నగేష్ వివరించారు. 23.07.2025 రోజున రఘునాథపాలెం మండలంలోని కోయచలక గ్రామము లో నున్నా శ్రీనివాసరావు 20 ఎకరంలలో నాటిన ఆయిలపామ్ తోటను గోద్రెజ్ ఫీల్డ్ ఆఫీసర్ చంద్ర శేఖర్ తో కలసి సందర్శించి ఈ విధంగా తెలిపారు. ఆయిల్ పామ్ లో చేపట్టవలసిన చర్యలను రైతుకి వివరించారు. ప్రస్తుత పరిస్థితులలో ఆయిల్ పామ్ పంట లాభదాయకమని ఒకసారి నాటితే 30 సంవత్సరం ల వరకు ఆదాయాన్ని ఇచ్చే పంట అని,కోతుల నుండి ప్రకృతి వైపరీత్యాల నుండి హాని లేని పంట అని, చీడ పీడలు తక్కువగా ఆశించే పంట అని,మార్కెటింగ్ సౌకర్యం ఉన్న పంట అని తెలిపారు. ప్రభుత్వం 200 రూపాయల విలువ గల మొక్కని రాయితీ మీద 20 రూపాయల కి ఇవ్వడం తో పాటు 4 సంవత్సరం ల పాటు నిర్వహణ ఖర్చుల కింద ప్రతి సంవత్సరం ఎకరాకు 4200 చొప్పున ఇస్తుంది. ఆయిల్ పామ్ పంటకు ఎస్సీ, ఎస్టీ లకు 100 శాతం, బీసీ లకు మరియు చిన్న సన్న కారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీ పై డ్రిప్ పరికరాలు ఇవ్వడం జరుగుతుంది. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.

# నేడు వైరాలో టియుడబ్ల్యుజె (ఐజెయు) ఖమ్మం జిల్లా మహాసభ

## ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ విజ్ఞప్తి



**ఖమ్మం టౌన్, 23 జూలై (కెరటం న్యూస్):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టియుడబ్ల్యుజె-ఐజెయు) జిల్లా మహాసభలు నేడు ఉదయం 10.30 గంటలకు వైరా పట్టణంలో జరుగుతున్నాయని ఈ సభకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పాత్రికేయులంతా పాల్గొన్ని విజయవంతం చేయాలని ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నామా పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి శీలం శ్రీనివాస్, కోశాధికారి కళ్యాణ్ చక్రవర్తి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మహాసభకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క్, రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తోపాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఎంపిలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదిప్, జిల్లా పోలీస్ కమీషనర్ సునీల్ దత్, టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర అధ్యక్షులు వీరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె రాంనారాయణ ఇతర జాతీయ, రాష్ట్ర నాయకులు. హాజరు కానున్నట్లు తెలిపారు. వైరాలో శభరి గార్డెన్లో మహా సభ జరుగుతుందని తెలిపారు. జర్నలిస్టుల హక్కులు,బసంక్షేమం కోసం పోరాడుతున్న ఐజెయు మహాసభల్లో జర్నలిస్టులంతా పాల్గొన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# పవనన్న స్వాగ్ నాకు చాలా ఇష్టం -మంత్రి లోకేశ్



**మూవీ న్యూస్, 23 జూలై (కెరటం న్యూస్):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమాపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. "మా పవన్ అన్న సినిమా విడుదల సందర్భంగా చిత్ర నిర్మాణంలో పాలుపంచుకున్న బృందానికి అభినందనలు. పవర్ స్టార్ అభిమానుల్లాగే నేనూ సినిమా ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఎదురుచూస్తున్నాను. పవనన్న, ఆయన సినిమాలు, స్వాగ్ నాకు చాలా చాలా ఇష్టం. పవర్ స్టార్ పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో 'హరిహర వీరమల్లు' అద్భుత విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని లోకేశ్ తెలిపారు.

# మున్నూరు కాపు ఉద్యోగులకు లకు సరైన పోస్టింగ్ లు ఇవ్వడం లేదు

## ఆర్జేసి కృష్ణ



**ఖమ్మం టౌన్, 23 జూలై (కెరటం న్యూస్):** మున్నూరు కాపు ఉద్యోగులకు సరైన పోస్టింగ్ లు ఇవ్వడం లేదు అని మున్నూరు కాపు సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ అన్నారు. తెలంగాణ మున్నూరు కాపు ఉద్యోగులు, విశ్రాంత సంఘం 3వ వార్షోత్సవ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కానీ, రెవిన్యూ కానీ ఏ డిపార్ట్మెంట్ అయినా మున్నూరు కాపు లకు సరైన పోస్టింగ్ లు ఇవ్వడం లేదు అని అన్నారు. గతంలో జిల్లాలో రెవిన్యూ లో కలెక్టరు లు గా,పోలీసు శాఖలో ఎస్పీలుగా, విద్యా శాఖలో డి ఇ ఒ లుగా పనిచేసి వారి సేవలు అందించి రాణించారన్నారు. ప్రస్తుతం ప్రాధాన్యత గల పదవుల్లో వారు ఉండకుండా అడ్డుపడుతున్నారని తెలిపారు. గతంకంటే ప్రస్తుతం ఈ వివక్ష ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని ప్రతీ ఒక్క కులస్తుడు గమనిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మున్నూరు కాపు కులస్థుల లకు సముచిత స్థానం కల్పించేలా సరైన పోస్టింగ్ లు ఇవ్వాలని, లేని యెడల భవిష్యత్ లో తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ప్రభుత్వ మున్నూరుకాపు ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పెద్దబోయిన నాగరాజు, సెక్రటరీకర్నాటి సోమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రాకం శ్యామ్ బాబు, ట్రెజరర్ దేవిసెట్టి వెంకటేశ్వర్లు, అసోసియేట్ ప్రధాన సలహాదారు కనకం జనార్ధన్ సభ్యులు, అచ్యుత్, రాజోలు శ్రీశైలం,నిమ్మల మురళీ, రంగా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రతన్ టాటా కూడా పెళ్లి చేసుకోలేదు కదా: నిత్యామీనన్



**మూవీ న్యూస్, 23 జూలై (కెరటం న్యూస్):** సెలక్టివ్‌గా సినిమాలు చేస్తూ అభిమానులను సొంతం చేసుకున్నారు నటి నిత్యామీనన్ . ప్రస్తుతం ఆమె నటించిన 'సార్ మేడమ్' విడుదలకు సిద్ధంగా ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రేమపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ప్రపంచంలో ప్రతిఒక్కరికీ ప్రేమ వివాహం చేసుకోవడం సాధ్యం కాదన్నారు. "ప్రేమ గురించి ఎన్నో సంవత్సరాల క్రితం ఆలోచించాను. ఇప్పుడు దానికి నా జీవితంలో అధిక ప్రాధాన్యం ఇవ్వడం లేదు. తల్లిదండ్రులు, కుటుంబం, సమాజం కారణంగా సోల్‌మేట్ ఉండడం అనివార్యమని గతంలో అనిపించేది. అతడిని వెతికిన సందర్భాలూ ఉన్నాయి. అయితే మనం వేరేరకంగా కూడా జీవితాన్ని ఆనందించవచ్చని తర్వాత అర్థం చేసుకున్నాను. ప్రతిఒక్కరికీ ప్రేమించిన వ్యక్తినే జీవిత భాగస్వామిగా చేసుకోవడం సాధ్యం కాదు కదా!. రతన్ టాటా కూడా వివాహం చేసుకోలేదు. పెళ్లి అనేది జీవితంలో ఓ భాగం మాత్రమే.. అది జరిగినా.. జరగకపోయినా మార్పు ఉండదు. తోడు లేనందుకు ఒక్కోసారి బాధ కలిగినప్పటికీ, స్వేచ్ఛగా జీవిస్తున్నందుకు ఆనందంగా ఉంది. జీవితంలో జరిగిన కొన్ని అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాల కారణంగానే నేను ప్రస్తుతం ఈ స్థితిలో ఉన్నాను. ఏది జరిగినా మన మంచికే అనుకొని ముందుకుసాగాలి" అని నిత్యామేనన్ తెలిపారు.ప్రస్తుతం నిత్యామీనన్ 'సార్ మేడమ్'తో పలకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. పాండిరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా జులై 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల విడుదలైన దీని ట్రైలర్ విశేషంగా ఆకట్టుకుంది. ఓ మధ్యతరగతి కుటుంబంలోని భార్యాభర్తల పాత్రల్లో నిత్యామేనన్, విజయ్ సేతుపతి ఎంతో సహజంగా నటించారంటూ, వారి కెమిస్ట్రీపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

# పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశానికి ఎంపీ వద్దిరాజు హాజరు



**న్యూ ఢిల్లీ బ్యూరో, 23 జూలై (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశానికి హాజరయ్యారు. ఢిల్లీలో బుధవారం సాయంత్రం జరిగిన సమావేశానికి సంఘం ఛైర్మన్ తర్కరే సునీల్ దత్తాత్రే అధ్యక్షత వహించారు. పెట్రోలియం, సహజ వాయువు ఉత్పత్తులు, వాటి ధరల హెచ్చుతగ్గులు, వినియోగదారుల అవసరాలు, వారికి అందుతున్న సేవలు, డిమాండ్, మరింత మెరుగైన, నాణ్యమైన సేవలను త్వరితగతిన అందించేందుకు ఇప్పుడు తీసుకుంటున్న, ఇకముందు చేపట్టవలసిన చర్యలు, ప్రమాదాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి సమావేశం చర్చించింది. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు పలు సూచనలు చేశారు, సలహాలిచ్చారు. సమావేశంలో పెట్రోలియం, సహజవాయువు శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# రజినీ 'కూలీ' సినిమాలోకి మరో స్టార్ హీరో ఎంట్రీ..?



**మూవీ న్యూస్, 23 జూలై (కెరటం న్యూస్):** సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా, సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'కూలీ' సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, పోస్టర్స్‌కి అద్భుత స్పందన రావడంతో సినిమాపై హైప్ రోజురోజుకీ పెరుగుతోంది. ముఖ్యంగా సినిమాకు నాగార్జున, ఉపేంద్ర, శృతిహాసన్ వంటి స్టార్స్ భాగం కావడం ప్రత్యేక బలాన్ని ఇస్తోంది. అది కూడా కథలో కీలక మలుపు తిప్పే పాత్రల్లో కనిపించనున్నారు. ఇక తాజాగా ఈ చిత్రంలో మరో స్టార్ హీరో కూడా ఎంట్రీ ఇవ్వబోతున్నారు..

సమాచారం ప్రకారం లోకనాయకుడు కమల్ హాసన్ ఈ మూవీకి వాయిస్ ఓవర్ ఇవ్వనున్నారని కోలీవుడ్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. 'విక్రమ్' వంటి బ్లాక్‌బస్టర్‌తో లోకేష్-కమల్ కాంబో బాక్సాఫీస్‌ని షేక్ చేసిన సంగతి తెలిసిందే. అదే బంధంతో లోకేష్ అడిగిన వెంటనే.. కమల్ వెంటనే ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. ఇంతకుముందు రజినీ-కమల్ కలిసి సినిమాల్లో నటించినా, ఈసారి రజినీ సినిమాలో కమల్ వాయిస్ వినిపించబోతుండడం అభిమానుల్లో ఆత్రుత మరింత ఎక్కువైంది. ఇది కేవలం ఓ వాయిస్ ఓవర్ కాకుండా, ఇద్దరు దిగ్గజాల మధ్య స్నేహ బంధానికి నిలువెత్తు ఉదాహరణగా మారనుంది. మొత్తనికి రజినీ మాస్‌తో, కమల్ క్లాస్‌తో, లోకేష్ మార్క్‌తో.. 'కూలీ' ఓ సంచలనం అవ్వడం ఖాయం..

# చివరి టీ20లో భారీ హిట్టింగ్.. అంతర్జాతీయ క్రికెట్‌కు రస్సెల్ గుడ్‌బై



**స్పోర్ట్స్ న్యూస్,23 జూలై (కెరటం న్యూస్):** వెస్టిండీస్ బ్యాటర్ ఆండ్రే రస్సెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. ఇవాళ అతను తన చివరి టీ20 మ్యాచ్ ఆడేశాడు. ఆస్ట్రేలియాతో జరిగిన ఆ మ్యాచ్‌లో అతను సూపర్ పర్ఫార్మెన్స్ ఇచ్చాడు. ఆఖరి మ్యాచ్‌లో అతను చెలరేగిపోయాడు. 15 బంతుల్లో 36 రన్స్ చేసి అతను ఔటయ్యడు. 37 ఏళ్ల రస్సెల్ టీ20 కెరీర్‌లో 1122 రన్స్ చేశాడు. అతను 86 మ్యాచ్‌లు ఆడాడు. వాటిల్లో 163 స్ట్రయిక్ రేట్ ఉన్నది. రస్సెల్ తన టీ20 కెరీర్‌లో 61 అంతర్జాతీయ వికెట్లను తీసుకున్నాడు.

సబినా పార్క్ మ్యాచ్‌లో విండీస్ ఫస్ట్ బ్యాటింగ్ చేసింది. 20 ఓవర్లలో ఆ జట్టు 8 వికెట్లు కోల్పోయి 172 రన్స్ చేసింది. ఓ దశలో 98 రన్స్‌కే కీలకమైన అయిదు వికెట్లు కోల్పోయిన విండీస్‌ను రస్సెల్ ఆదుకున్నాడు. అతని ఇన్నింగ్స్‌లో నాలుగు సిక్సర్లు, రెండు ఫోర్లు ఉన్నాయి. ఆ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా సునాయాసంగా చేధించింది. కేవలం రెండు వికెట్లు కోల్పోయి 16వ ఓవర్‌లో ఆ టార్గెట్‌ను అందుకున్నది. జోష్ ఇంగ్లిష్, కెమరూన్ గ్రీన్.. హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు.

ఆండ్రీ రస్సెల్ ఫీల్డింగ్‌కు వస్తున్న సమయంలో.. ఇరు జట్ల ఆటగాళ్లు అతని గార్డ్ ఆఫ్ హానర్ ఇచ్చారు. అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లను ఆస్ట్రేలియా కైవసం చేసుకున్నది. దీంతో సిరీస్ ఆసక్తికరంగా మారింది.